సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 5 । జనవరి । 2023



పట్టుకున్నారు.. తొక్కించారు

శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న 173 మోటార్‌బైక్‌ల సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు బుధవారం నెల్లూరులో రోడ్డురోలర్ ద్వారా ధ్వంసం చేశారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,860
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,168
3 శాతం జీఎస్టీతో	రూ.5,323
నవర (8 గ్రా)	రూ.42,584

గరిష్టం/కనిష్టం
30.5 /23.1

వాతావరణం

బుధవారం గాలిలో 68 శాతం తేమ ఉంది. గురువారం పొడి వాతావరణం ఉంటుంది. రాత్రి చలి వాతావరణం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన కలెక్టర్



వైఎస్ జగన్‌కు పూలమొక్కను అందజేస్తున్న చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు బుధవారం తాడేపల్లిలో కలిశారు. పూలమొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును సీఎంకు కలెక్టర్ వివరించారు. కొన్ని పథకాల అమలులో నెల్లూరు ముందంజలో ఉండడంతో జగన్ ప్రశంసించారు. అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డిని కలెక్టర్ కలిశారు.

మూడు లక్షల మందికి పింఛన్ల అందజేత



జీజీహెచ్‌లో నగదు అందజేస్తున్న వలంటీర్ కరిష్మా తాజ్

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం నాటికి 96.18 శాతం మందికి నగదు అందజేశారు. మొత్తం 3,14,237 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక ఇవ్వాల్సి ఉండగా 3,02,240 మందికి ఇప్పటికే అందింది. రాపూరు, నెల్లూరు, వెంకటాచలం మండలాలు పంపిణీలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

నేడు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

నెల్లూరు(అర్బన్): ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు వెంకటాచలం మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీకి చేరుకుని జర్నలిజంలో డిప్లొమా కోర్సు గురించి వర్సిటీ అధికారులతో చర్చిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొంటారు. 5 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి భవనానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఒంగోలుకు బయలుదేరుతారు.

ఆడియో మెట్రీషియన్ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న ఆడియో మెట్రీషియన్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తున్నామని, ఇందుకోసం ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను చేసుకోవచ్చని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులు అందించాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్, ఇతర వివరాల కోసం హెచ్‌టీటీపీఎస్://ఎస్పీఎస్‌ఆర్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు కేటగిరి/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో సందర్శించాలన్నారు.

సోమశిలలో 71.996 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 71.996 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 5,086 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 300, కండలేరుకు 1,600 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.760 మీటర్ల మట్టం నమోదైంది. సగటున 313 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది.

వేగంగా.. నాణ్యతగా..

మూడేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల భవనాలు దారుణంగా ఉండేవి. ఇక వసతుల సంగతి సరేసరి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అంగన్‌వాడీ కేంద్రాలు అధ్వానంగా దర్శనమిచ్చేవి. అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ వీటి అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పథకాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల తొలిదశలో వేలాది బడులకు కొత్త కళ వచ్చింది. ప్రస్తుతం రెండో దశలో మరిన్ని పాఠశాలలు, ఇంకా అంగన్‌వాడీలు, కాలేజీల రూపురేఖలు మార్చేందుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

- ముమ్మరంగా నాడు – నేడు రెండోదశ పనులు
- ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, కాలేజీల ఎంపిక
- మొత్తం పది రకాల అభివృద్ధి పనులు
- మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశాలు
- ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న యంత్రాంగం



కావలి మండలం ముసునూరులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణం

నెల్లూరు(టౌన్): ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే ప్రజలకు చిన్నచూపు ఉండేది. అక్కడ సౌకర్యాలు ఉండవని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు పంపేవారు. నేడు పరిస్థితి మారింది. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు – నేడు పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఇప్పటికే ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో తొలివిడతలో 1,059 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.232 కోట్లు ఖర్చు చేశారు. రెండో విడత పనులు ప్రస్తుతం శరవేగంగా నాణ్యతగా జరుగుతున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలల్లో అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే 15 శాతం నిధులు విడుదల చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేసి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కార్పొరేట్ లుక్‌లో విద్యార్థులకు స్వాగతం చెప్పనున్నాయి.

ఏం చేస్తారంటే..

ఎంపికైన పాఠశాలలు, అంగన్‌వాడీలు, బీఈడీ, డైట్ కళాశాలల్లో మొత్తం పది రకాల అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, ప్రహరీలు, కిచెన్ షెడ్‌ల నిర్మాణాలు చేస్తున్నారు. పెయింట్ వేయిస్తారు. లైట్లు, ఫ్యాన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం కుర్చీలు, బెంచీలు, ఇంగ్లిష్ ల్యాబ్, గ్రీన్ చాక్‌బోర్డు తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. మేజర్, మైనర్ రిపేర్లు చేపడతారు.

జిల్లాలో..

రెండో దశలో ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలలు :	864
ప్రాథమికోన్నత :	136
ఉన్నత పాఠశాలలు :	247
డైట్ కాలేజీ :	1
బీఈడీ కళాశాల :	1
అంగన్‌వాడీ కేంద్రాలు :	108

జూనియర్ కళాశాలల్లోనూ..

జిల్లాలోని 22 జూనియర్ కళాశాలలను నాడు–నేడుకు ఎంపిక చేశారు. వాటిల్లో పలు రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించడం, కళాశాల భవనాలకు మరమ్మతులు, పెయింట్ వేయించడం, గ్రీన్ చాక్‌బోర్డు, కుర్చీలు, బల్లలు తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.13.44 కోట్లను మంజూరు చేశారు. తొలివిడతలో భాగంగా రూ.2.42 కోట్లను తల్లిదండ్రుల కమిటీ అకౌంట్లలో జమ చేశారు. ఇప్పటివరకు రూ.1.62 కోట్లను ఆయా పనుల కోసం ఖర్చు చేశారు. కళాశాలల్లో నాడు–నేడు పనులను కూడా మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

త్వరగా పూర్తి చేయాలి



నాడు–నేడు పనుల కోసం రూ.4 కోట్ల మేర సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ (ఫర్నీచర్, శానిటరీ, ఫ్యాన్లు, లైట్లు, ఎలక్ట్రికల్స్, సిరామిక్ టైల్స్ తదితరాలు) జిల్లాకు వచ్చింది. వీటితోపాటు సిమెంట్ కూడా వచ్చింది. పనులను అత్యంత నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలి. పనులు జరుగుతున్న పాఠశాలల్లో విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– ఉషారాణి, ఏపీసీ, సమగ్రశిక్ష

ఎక్కడంటే..

కొత్త **నెల్లూరు జిల్లాలో** రెండో **విడత నాడు** – నేడులో భాగంగా 1,357 పాఠశాలలు, అంగన్‌వాడీలు తదితరాలను ఎంపిక చేశారు. మొత్తం 531 పాఠశాలల్లో 1,841 అదనపు తరగతి గదులు నిర్మించనున్నారు. రెండో విడత పనుల కోసం ప్రభుత్వం రూ.466.40 కోట్లను కేటాయించింది. దీనికి సంబంధించి తొలిదశలో రూ.79.67 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులను నేరుగా ఆయా పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ సభ్యుల అకౌంట్లలో జమ చేశారు. ఇప్పటికే రూ.72.10 కోట్లు ఖర్చు చేసి పనులు చేశారు. మిగిలిన నిధులను దశల వారీగా ప్రభుత్వం ఆయా అకౌంట్లలో జమ చేయనుంది.



గుడ్లూరులోని కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణం

పర్యవేక్షణ కమిటీల ఏర్పాటు

నాడు–నేడు పనులు **త్వరితగతిన పూర్తి** చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. పాఠశాల స్థాయిలో హెడ్ మాస్టర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, మండల స్థాయిలో ఎంఈఓ, ఏపీఎం, డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈఓ, జిల్లా స్థాయిలో పంచాయతీ రాజ్ ఎస్ఈ, సమగ్రశిక్ష ఈఈ కమిటీల్లో ఉన్నారు. సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ రోజూ తమ బడులకు వెళ్లి పనులను ఫొటో తీసి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



దగదర్తి మండలంలోని దుండిగం జెడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్ల నిర్మాణం

సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గిరిధర్‌రెడ్డి



గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. చిత్రంలో నాయకులు

నెల్లూరు రూరల్: వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్టానం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో గిరిధర్‌రెడ్డికి ఈ పదవి వరించింది. దీంతో రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.

- నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గిరిధర్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో 41, 33 డివిజన్ల పార్టీ అధ్యక్షులు మురళీకృష్ణ యాదవ్, హజరత్ నాయుడు, రాజరాజేశ్వరి దేవస్థానం చైర్మన్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇంకా నగర మేయర్ స్రవంతి దంపతులు గిరిధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

స్పెషల్ పీపీగా కనకాద్రి



ఎస్.కనకాద్రి

నెల్లూరు(లీగల్): సీఐడీకి సంబంధించిన (క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది అయిన నన్నం కనకాద్రి చెన్నయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు, జిల్లా కోర్టులో సీఐడీ తరఫున కేసులను వాదిస్తారు. సీనియర్ న్యాయవాది అయిన రామిరెడ్డి రోజారెడ్డి వద్ద కనకాద్రి జూనియర్‌గా పనిచేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తన నియామకంలో సహకారమందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి రోజారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ కనకాద్రికి అభినందనలు తెలియజేశారు.

వచ్చే ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యం



రామ్‌కుమార్‌రెడ్డి సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- సమన్వయంతో వెంకటగిరిలో ముందుకెళ్తాం
- నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): 'వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం. వెంకటగిరిలో అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తాం.' అని ఆ పార్టీ వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నెల్లూరులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. వెంకటగిరిలో క్షేత్రస్థాయిలో అందరినీ కలుపుకొని పనిచేస్తామన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తాను ఈ మూడు సంవత్సరాల కాలంలో ఎవరినీ చిన్నమాట కూడా అనలేదని గుర్తుచేశారు. ఎవరితోనూ తనకు విభేదాలు లేవన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకెళ్తానే తప్ప మరో ఆలోచన లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన సమన్వయకర్త బాధ్యతలకు న్యాయం చేస్తానని, వెంకటగిరి నియోజకవర్గంలోని లోపాలను సరిచేసి పార్టీని ముందుకు నడిపిస్తానన్నారు.

నేదురుమల్లి ఇంట సందడి

వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన రామ్‌కుమార్‌రెడ్డిని కలిసేందుకు ఆ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున నాయకులు, అభిమానులు తరలివచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు కూడా ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో నేదురుమల్లి ఇంట సందడి వాతావరణం నెలకొంది. వచ్చిన ప్రతిఒక్కరినీ రామ్‌కుమార్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక ఓపీ, వార్డు



పెద్దాస్పత్రిలో ఈహెచ్‌ఎస్ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఓపీ తదితర గదులు

- జిల్లాలో తొలిసారిగా జీజీహెచ్‌లో ఏర్పాటు
- 20 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో ఈహెచ్‌ఎస్ ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం స్పెషలిస్టు డాక్టర్లతో కూడిన ప్రత్యేక ఓపీ (ఔట్ పేషెంట్ విభాగం), ఇన్ పేషెంట్ విభాగాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఓపీ వద్దనే ల్యాబ్, మందుల విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ విభాగాలను వచ్చే వారంలో ప్రారంభించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉద్యోగులకు ఓపీ చూస్తారు. సోమవారం నుంచి శనివారం వరకు చూసే వ్యాధుల వివరాలు, విభాగాల గురించి ఆస్పత్రిలో ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేశారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, మానసిక, చర్మ సంబంధ, గ్యాస్ట్రో, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ, ఊపిరితిత్తులు, కిడ్నీలు, దయాబెటిస్, బీపీ, కీళ్ల వ్యాధులు, పార్కిన్‌సన్స్ (వణుకుడు జబ్బు), ఫిట్స్ డిజార్డర్స్, ఇలా 24 రకాల దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఉద్యోగులకు నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ప్రత్యేక వైద్యసేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో జిల్లాలో ఉన్న సుమారు 20 వేల మందికి పైగా ఈహెచ్‌ఎస్ వర్తించే ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈహెచ్‌ఎస్ ఉన్న ఉద్యోగులకు పెద్దాస్పత్రిలో ప్రత్యేక వైద్యసేవలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఓపీసేవలతోపాటు ఇన్ పేషెంట్ సేవలందిస్తాం. ఉద్యోగులకు ఎంతో ఉపయోగరమైన సేవలందుతాయి.

– డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

తహసీల్దార్ కార్యాలయంలో సీపీయూ చోరీ

- విచారణ చేస్తున్న పోలీసులు



తహసీల్దార్ కార్యాలయం

సీతారామపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ సీపీయూ మూడురోజుల క్రితం చోరీకి గురైంది. తహసీల్దార్ షాజియా ఫిర్యాదు మేరకు ఉదయగిరి సీఐ గిరిబాబు బుధవారం కార్యాలయానికి వెళ్లి విచారణ చేపట్టారు. వారి కథనం మేరకు.. సీతారామపురం పంచాయతీలోని సర్వే నంబర్–1లో 438 ఎకరాల మేత పోరంబోకు భూముల్లో 47 ఎకరాలు ఆక్రమణకు గురైందని గ్రామస్తులు ఇటీవల ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, స్థానికులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు చెప్పారు. కాగా కార్యాలయంలో కీలక సమాచారం ఉండే సీపీయూ మాయం కావడంతో మండలంలో కలకలం రేగింది. భూములు ఆక్రమించిన వారే ఇలా చేసి ఉండొచ్చనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మరోవైపు కార్యాలయం వద్దనే తాళాలు ఉంచి వెళ్తుండడంతో కార్యాలయ సిబ్బందిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని సీఐ గిరిబాబు తెలిపారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 117
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 228
లేయర్ చికెన్	: 145

రైలు ఢీకొని ఇద్దరి మృతి

- రైలు రాకను గమనించని వృద్ధురాలు
- ఆమెను కాపాడేందుకు యత్నించిన వ్యక్తి
- ఇద్దరూ మృత్యువాత

నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొని వృద్ధురాలు, ఆమెను రక్షించబోయిన మరో వ్యక్తి మృతిచెందారు. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నెల్లూరులోని సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వృద్ధురాలు చెన్నై వైపు వెళ్లే పట్టాలు దాటేందుకు నడుస్తోంది. ఇంతలో విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్ వేగంగా వస్తుండడాన్ని గమనించకుండా ఆమె పట్టాలు దాటసాగింది. దీనిని చూసిన ఓ వ్యక్తి ఆమెను రక్షించే ప్రయత్నం చేశాడు. అప్పటికే సమయం మించిపోవడంతో వృద్ధురాలితోపాటు రక్షించేందుకు వెళ్లిన ఇద్దరిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వయసు 60 నుంచి 65 సంవత్సరాల్లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. గోధుమ, గ్రీన్ కలర్ డిజైన్ చీర, పర్పుల్, వైట్ కలర్ జాకెట్ ధరించి ఉంది. మరో వ్యక్తి వయసు 40 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండొచ్చని చెబుతున్నారు. ఎరుపు, నలుపు రంగు గళ్ల చొక్కా, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతడి జేబును పరిశీలించగా ఒక ఫోన్ నంబర్ దొరికింది. దాని ఆధారంగా మృతుడు క్యాటరింగ్ పనులకు వెళ్లేవాడని తెలిసింది. ఇతర వివరాలు తెలియరాలేదు. దీంతో మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం తరలించారు. బుధవారం ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పట్టుకున్నారు.. తొక్కించారు

- పెద్ద శబ్దం చేసే 173 సైలెన్సర్ల ధ్వంసం

నెల్లూరు(క్రైమ్): శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న మోటార్‌బైక్‌ల సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని ధ్వంసం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు, హారన్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఆర్ ఏఎస్పీ జి.శ్రీనివాసరావు వాహనదారులను హెచ్చరించారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు వాహనాల నుంచి తొలగించిన 173 సైలెన్సర్లను బుధవారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో రోడ్డురోలర్ ద్వారా తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ శబ్ద కాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లు వినియోగిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న వాహనచోదకులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశించారన్నారు. దీంతో నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగేశ్వరమ్మ స్పెషల్ డ్రైవ్ చేపట్టారన్నారు. పెద్ద శబ్దం చేసే సైలెన్సర్లను తీయించి తిరిగి బండికి ఇచ్చిన ఒరిజినల్‌వి బిగించేలా చేస్తున్నారన్నారు. వాహనదారులకు ఇలాంటి సైలెన్సర్లు విక్రయించే వారు, వాటిని బిగించే మెకానిక్‌లపై సైతం చర్యలు తప్పవన్నారు. స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు చంద్రమౌళి, నాగరాజు పాల్గొన్నారు.



రోడ్డురోలర్‌తో సైలెన్సర్లను తొక్కిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.14
సన్నవి	: రూ.10
పండ్లు	: రూ.4

పసిపాపకు పెద్దకష్టం

- లివర్ మార్పిడి చేయాలన్న డాక్టర్లు
- రూ.25 లక్షలు అవుతుందని వెల్లడి
- ఇప్పటికే సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10 లక్షల మంజూరు



లివర్ వ్యాధితో బాధపడుతున్న పాప



మాట్లాడుతున్న నందిని

నెల్లూరు(బారకాసు): ఓ పసిపాపకు పెద్ద కష్టం వచ్చింది. లివర్ వ్యాధితో బాధపడుతోంది. ఎన్నో ఆస్పత్రుల్లో చూపించినా లివర్ మార్పిడి తప్పనిసరని, అందుకు రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెబుతున్నారు. లేకపోతే పాప ప్రాణానికే ప్రమాదమని వైద్యులు తెలియజేశారు. ఏం చేయాలో దిక్కుదోచక పాప తల్లితండ్రులు దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. బుధవారం నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో పాప తల్లిదండ్రులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఆత్మకూరు నియోజకవర్గంలోని వాశిలి గ్రామంలో నివాసం ఉంటున్న నారా నందిని, వెంకటేశ్వర్లు దంపతులకు ఇద్దరు సంతానం. మొదటి సంతానంగా బాబు, తర్వాత పాప జన్మించారు. పాప వయసు 9 నెలలు. పుట్టినప్పటి నుంచే అనారోగ్యానికి గురైంది. శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులతోపాటు ఇతర సమస్యలు తలెత్తాయి. కూలి పనులు చేసే భార్యాభర్తలు ఎంతో ఖర్చు చేసి అనేక ఆస్పత్రుల్లో చూపించిన తర్వాత పాపకు లివర్‌వ్యాధి ఉందని వైద్యులు నిర్ధారించారు. చెన్నైకి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు పాపకు లివర్ మార్పిడి చేయాలని అందుకు రూ.25 లక్షల ఖర్చవుతుందని తెలియజేశారు. దీంతో తల్లితండ్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించగా వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10 లక్షలు మంజూరు చేసింది. పూర్తి వైద్యానికి మరో రూ.15 లక్షలు అవసరం కావడంతో తల్లిదండ్రులు దాతల సాయం కోరుతున్నారు. ఫిబ్రవరిలో ఆపరేషన్ ద్వారా లివర్ మార్పిడి చేసేందుకు చెన్నైలోని వైద్యులు నిర్ణయించారని తెలిపారు. ఆర్థిక సహాయం చేయదలుచుకున్న వారు 91776 74074 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైభవం.. గ్రామదేవతల గ్రామోత్సవం



గంగమ్మ గ్రామోత్సవం



కలుగోళమ్మ గ్రామోత్సవం

అల్లూరు: అల్లూరు ఊరు ఉత్సవం సందర్భంగా అక్కాచెల్లెళ్లు అయిన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల గ్రామోత్సవాలను బుధవారం తెల్లవారుజాము నుంచి వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లను పూలతో అలంకరించి వాహనాలపై కొలువు దీర్చారు. అమ్మవార్లు ఒకరి ముఖాలు మరొకరికి ఎదురు కాకుండా జాగ్రత్త వహిస్తూ గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, డీజే సౌండ్స్, తీన్‌మార్, కీలుగుర్రాలు, సంప్రదాయ తప్పెట్లు, మంగళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పోలేరమ్మ గ్రామోత్సవం

వరద రక్షణ పనులు వేగవంతం చేయండి

- చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులురెడ్డి

సోమశిల: సోమశిల జలాశయం యాప్రాన్ వద్ద జరుగుతున్న వరద రక్షణ పనులను వేగవంతం చేయాలని తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం ఆయన సోమశిల జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా క్రస్ట్ గేట్లు, కండలేరు వరద కాలువ రెగ్యులేటర్, ఉత్తరకాలువ రెగ్యులేటర్, మట్టి కట్టడం, ఉత్తరకాలువను పరిశీలించారు. అనంతరం యాప్రాన్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పనుల పురోగతి గురించి ఎస్ఈ బిజివేముల రమణారెడ్డి వద్ద ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జలాశయంలో నీటి నిల్వలు 71 టీఎంసీలకు చేరుకున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజలకు సాగునీటితోపాటు కండలేరుకు కూడా ఈసారి గతేడాదిలాగే భారీగా నీరు విడుదల చేశామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు సజావుగా అందేలా చూడాలని అధికారులకు తెలిపామన్నారు. యాప్రాన్ పనుల పురోగతిని పెంచాలని సూచించామన్నారు. ఆయన వెంట తెలుగుగంగ ఎస్ఈ హరినారాయణరెడ్డి, ఈఈ బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డి, జలాశయం సిబ్బంది ఉన్నారు.



జలాశయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఈ శ్రీనివాసులురెడ్డి

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలో? వేరే కారణమో స్పష్టంగా తెలియదు కానీ ఓ వృద్ధ జంట పెన్నానదిలో దూకేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కుమారుడికి అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.. సంగం మండలం దువ్వూరుకు చెందిన బి.వెంకయ్య, శేషమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వెంకయ్య బుచ్చి ఇరిగేషన్ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేసి పదవీ విరమణ చేశాడు. ఇటీవల దంపతులు నెల్లూరు బీవీనగర్‌లో నివాసముంటున్న చిన్న కుమారుడు శీనయ్య వద్దకు వచ్చారు. బుధవారం స్వగ్రామానికి బయలుదేరారు. ఈక్రమంలో పెన్నా బ్రిడ్జి పైనుంచి భార్యాభర్త దూకేందుకు యత్నిస్తుండగా స్థానికులు గమనించి ఆపారు. మహిళా పోలీసులు శార్వాణి, రూప నవాబుపేట ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావుకు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు బ్లూకోల్ట్స్ సిబ్బంది కె.కిరణ్‌కుమార్, యు.మనోహర్ వెంటనే బ్రిడ్జి వద్దకు వెళ్లి దంపతులతో మాట్లాడి స్టేషన్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని శీనయ్యకు అప్పగించారు.



దంపతులను అప్పగించిన ఇన్‌స్పెక్టర్

మతిస్థిమితం లేని మహిళ..

లింగసముద్రం: మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు కాపాడారు. ఈ ఘటన రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు కథనం మేరకు.. కావలిలోని వైకుంఠపురానికి చెందిన పటాన్ సబ్జాది (40) అనే మహిళ రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త స్పిల్‌వే వద్ద ఉన్న మెట్ల నుంచి ప్రాజెక్టులోకి దూకేందుకు ప్రయత్నిస్తుండగా.. స్థానికులు గమనించి ఆపారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మహిళను కాపాడారు. అయితే ఆమెకు మతిస్థిమితం లేకపోవడంతో వివరాలు చెప్పలేకపోయింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న భర్త ఇస్మాయిల్, కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో వారికి ఆమెను అప్పగించారు.



మహిళతో మాట్లాడుతున్న ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు